సాక్షి
పశ్చిమగోదావరి



శుక్రవారం । 8 । మార్చి । 2024

న్యూస్‌రీల్

మహిళలు స్ఫూర్తిగా నిలవాలి



ఎస్పీ అజితకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

భీమవరం: మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లక్ష్య సాధనతో ముందుకు సాగాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణనిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, 30 శాతం మహిళా ఉద్యోగులు ఉన్నారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ పి.భువనేశ్వరి, బీహెచ్‌వీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 97 శాతం హాజరు



సీసీ కెమెరాల ద్వారా పరీక్షల తీరును పరిశీలిస్తున్న దృశ్యం

పెనుగొండ: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని పరీక్షల కన్వీనర్, ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. గురువారం పెనుగొండలోని పలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 16,147 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. జనరల్ విభాగంలో 14,692 మందికి 14,286 మంది, ఒకేషనల్ విభాగంలో 1,455 మందికి 1,367 మంది హాజరయ్యారన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని, ఆర్ఐఓ కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు



పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా రిటైర్డ్ అధ్యాపకుడు, పట్టణ 25వ వార్డు ఇన్‌చార్జ్ రావి నాగేశ్వరరావుని నియమించినట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) గురువారం తెలిపారు. నాగేశ్వరరావు అధ్యాపకుడిగా పదవీ విరమణ చేసిన అనంతరం 11 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

ఆలోచనల్లో మహిళలు ముందుంటారు

ఏలూరు (టూటౌన్): కుటుంబ సక్రమ నిర్వహణతో పాటు ఉద్యోగం, జీవితంలో పనిచేసే వారి ఆలోచన విధానం పురుషులతో పోలిస్తే మహిళలు ముందుంటారని శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సును స్థానిక న్యాయసేవా భవన్‌లో నిర్వహించారు.

శంకర.. శుభంకర



పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లులో కాంతులీనుతున్న క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం



భీమవరం (ప్రకాశం చౌక్) : ప్రత్యేక అలంకరణలో ఉమా సోమేశ్వరుడు

అభిషేక ప్రియుడైన ఆ పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకునేందుకు.. ఆది భిక్షువు సేవలో తరించేందుకు శైవక్షేత్రాలు సన్నద్ధమయ్యాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక శోభతో కళకళలాడుతున్నాయి. 'హరహర శంకర.. శంభో శంకర' అంటూ మంత్రోచ్ఛరణలు మార్మోగుతున్నాయి. అశేష భక్తజనం జంగమయ్య దర్శనానికి ఆలయాల బాట పట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం గునుపూడిలో కాంతులీనుతున్న సోమేశ్వరస్వామి ఆలయం

ఎన్నికల నిబంధనలపై అవగాహన తప్పనిసరి

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ప్రతిపాదనలు, ఫిబ్రవరి 29 తర్వాత అందిన ఫామ్స్‌కు సంబంధించి ఓటర్ల చేర్పులు, మార్పులు, ఈసీఐ నిబంధనలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 85 ఏళ్లు పైబడిన, 40 శాతం వికలాంగత్వం ఉన్న వారికి మాత్రమే హోం ఓటింగ్‌కు అనుమతి ఉందని, వారు బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్ కౌంటింగ్ కేంద్రాలను భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను విష్ణు కాలేజీలో ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. ఈనెల 9న జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నామన్నారు.

ఆర్మీ పరీక్షలకు దరఖాస్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ అర్హత పరీక్షకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. 2024–25కి సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల 13 నుంచి ప్రారంభమవుతుందని, 22 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాలను రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం ఎంపిక చేశారని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

గన్ని సీటు గల్లంతు!

- టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడికి నో టికెట్ !
- ఉంగుటూరు అసెంబ్లీ స్థానం జనసేనకు కేటాయింపు !
- జనసేన అభ్యర్థి పేరుతో టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వేలు
- గందరగోళంలో ఉంగుటూరు టీడీపీ కేడర్
- అత్యవసరంగా నియోజకవర్గ సమావేశం
- చెప్పకుండా సీటు మార్చడంపై పార్టీ శ్రేణుల ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సీటు గల్లంతైంది. పొత్తులు ఉన్నా లేకపోయినా సీటు నాదే అంటూ ఒకటికి పదిసార్లు హడావుడి చేస్తున్న ఉంగుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గన్నికి తెలుగుదేశం పార్టీ గట్టి షాక్ ఇచ్చింది. పొత్తుల్లో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించడంతో ఆయన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కనీసం మాట మాత్రం కూడా చెప్పకుండా మొండి చేయి చూపడంపై ఆయన తీవ్ర ఆందోళనలో ఉండగా కేడర్ గందరగోళానికి గురైంది.

రెండు జిల్లాల అధ్యక్షులకూ మొండిచేయి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులకు హ్యాండ్ ఇవ్వటం పార్టీకి రివాజుగా మారింది. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మికి టికెట్ లేదు సర్దుకోమని ముందుగానే చెప్పారు. ఇప్పుడు ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వంతు వచ్చింది. గన్నికి టికెట్ లేదని చెప్పకుండా జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు ఓటు వేస్తారా అంటూ టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే బుధవారం నుంచి నియోజకవర్గంలో మొదలుకావడంతో అటు కేడర్‌తో పాటు ఇటు గన్నికి మైండ్ బ్లాక్ అయ్యింది. దాదాపు 25 ఏళ్లకు పైగా తెలుగుదేశం పార్టీ క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న గన్ని వీరాంజనేయులు మొదటి సారిగా 2009లో ఉంగుటూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. అప్పట్లో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురి కావడంతో ఆయన భార్య పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014లో వీరాంజనేయులు గెలుపొందగా.. 2019లో మరలా ఓటమి పాలయ్యారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అయితే పొత్తుల్లో భాగంగా జనసేన ఉంగుటూరు టికెట్‌ను బలంగా కోరిన నేపథ్యంలో గన్ని ఆశలు ఆడియాసలయ్యాయి.



చెప్పకుండా చేసేశారు..

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి సీటుకే పార్టీలో దిక్కులేదు. కనీసం ఒక మాట కూడా చెప్పకుండా, సంప్రదింపులు కూడా లేకుండా ఏకపక్షంగా టికెట్ కేటాయించడంపై పార్టీ శ్రేణులు రగిలిపోతున్నారు. టికెట్ కేటాయింపుపై ముఖ్య నేతలను సంప్రదిస్తే ఇన్‌చార్జికి స్పష్టత వచ్చింది. దీనికి బలం చేకూర్చేలా టీడీపీ సర్వేలో జనసేన అభ్యర్థి పేరు రావడంతో నియోజకవర్గమంతా విషయం తెలిసిపోయింది. దీంతో గన్ని వీరాంజనేయులు గురువారం హడావుడిగా భీమడోలులో నియోజకవర్గ అత్యవసర సమావేశం నిర్వహించగా నాలుగు మండలాల నుంచి అధ్యక్షులు, పార్టీ నాయకులు తరలివచ్చారు. సమాచారం లేకుండా టీడీపీ సీటును జనసేనకు ఇవ్వడం సరికాదని, అది కూడా జిల్లా అధ్యక్షుడి సీటే గల్లంతు చేస్తే ఎలా అని పార్టీ నాయకులు ప్రశ్నించారు. అవసరమైతే మండలాల వారీగా రాజీనామాలు చేస్తామని శ్రేణులు ప్రకటించారు. అధిష్టానంతో మాట్లాడిన తర్వాత ఏం చేయాలనేది ఆలోచిద్దామని, ఎవరూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను తిట్టవద్దని నాయకులు సూచించారు. ఇదిలా ఉంటే టీడీపీ, జనసేన పొత్తుల సమయం నుంచి ఇద్దరు నాయకులు క్రియాశీలకంగా ఉన్నా కలిసి కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాలు లేవు. పూర్తిగా ఎవరికి వారే కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన తాడేపల్లిగూడెం జెండా సభకు కూడా ఎవరి వాహనాలు వారు ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరు నేతలూ వేర్వేరుగా ఆశీర్వాద యాత్రలు చేస్తున్నారు.

పొత్తు ధర్మాన్ని పాటిస్తే వెనుకబడి పోతాం

నియోజకవర్గ పార్టీ నిర్ణయమే శిరోధార్యం: గన్ని వీరాంజనేయులు



భీమడోలులో సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

భీమడోలు: పొత్తు ధర్మాన్ని పాటించి.. గెలుపు ధర్మాన్ని పక్కన పెట్టడం వల్ల వెనుకబడి పోతామని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఉంగుటూరు సీటును జనసేనకు కేటాయించడంపై భీమడోలులో గురువారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. గన్నికే సీటు కేటాయించాలని, గెలుపు ధర్మాన్ని పాటించాలని కోరుతూ ఏకగ్రీవంగా పార్టీ శ్రేణులు తీర్మానించారు. ముందుగా గన్ని వీరాంజనేయులు టీడీపీ నాయకులు, కార్యకర్తలను సముదాయిస్తూ భవిష్యత్తు వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ పార్టీ నిర్ణయమే తన నిర్ణయమన్నారు. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండల పార్టీ అధ్యక్షులు శిరిబత్తిన కొండబాబు, పాతూరు విజయకుమార్, ఎం.వెంకటేశ్వరరావు, రాజు, జిల్లాస్థాయి నాయకులు తమ మనోగతాన్ని బాహాటంగా వ్యక్తం చేశారు. అవసరమైతే అస్త్ర సన్యాసం తీసుకుంటామని, మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని వారు హెచ్చరించారు. టికెట్ గన్నికి కాదని జనసేనకు కేటాయించడం సరైన నిర్ణయం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

దళిత మహిళపై టీడీపీ వార్డు సభ్యుడి
అత్యాచార యత్నం



పంచాయతీ కార్యాలయం వద్ద వినతిపత్రం అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఇన్‌సెట్‌లో) నాంచారయ్య (ఫైల్)

కైకలూరు: తెలుగుదేశం పార్టీకి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు ఓ దళిత మహిళపై లైంగిక దాడికి యత్నించిన ఘటన గురువారం జరిగింది. ఏలూరు జిల్లా కైకలూరు మండలం దానిగూడెం గ్రామానికి చెందిన వివాహిత మహిళ (32) గురువారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో దానిగూడెం కాల్వగట్టుపై వెళుతుండగా 8వ వార్డు సభ్యుడు మోదూరి నాంచారయ్య అడ్డగించి లైంగిక దాడికి యత్నించాడు. అదే సమయంలో అటుగా ఇద్దరు వ్యక్తులు రావడం చూసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలు కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిపై లైంగిక దాడి యత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్టు టౌన్ ఏఎస్సై మల్లికార్జునరావు తెలిపారు.

విధులను బహిష్కరిస్తాం

బాధిత మహిళను నాంచారయ్య మూడు నెలలుగా మానసికంగా వేధిస్తున్నాడని, అతడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సహచర కార్మికులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పోలీసులు తక్షణ చర్యలు తీసుకోపోతే తాము విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సర్పంచ్ దాసం మేరీ నవరత్నకుమారికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇప్పటికే జాన్‌పేట మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు నాంచారయ్యపై కేసు నమోదైందని చెప్పారు. నాంచారయ్య ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై ఫిర్యాదులు చేసి బ్లాక్ మెయిలింగ్‌కి పాల్పడుతున్నాడన్నారు. అతడిని తక్షణం అరెస్టు చేయకపోతే బాధితుల తరఫున తాను కూడా ఆందోళన చేస్తానని చెప్పారు.

మహిళా సాధికారతకు 'చేయూత'

- మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ చేయూత అందజేత
- జిల్లాలో 85,105 మందికి రూ.159.57 కోట్ల లబ్ధి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రంలో మహిళా సాధికారత, మహిళల స్వయం ఉపాధికి వైఎస్సార్ చేయూత పథకం భరోసాగా నిలుస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. అనకాపల్లి జిల్లాలో వైఎస్సార్ చేయూత పథకం కింద సీఎం జగన్ మీట నొక్కి మహిళల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి గురువారం వర్చువల్‌గా వీక్షించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మహిళల చేతుల్లో డబ్బు పెడితే అది పూర్తిగా వారి కుటుంబం, ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడం కోసం ఉపయోగిస్తారని రాష్ట్ర ప్రభుత్వం మంచి ఆలోచన చేసిందన్నారు. చేయూత ద్వారా చిన్నపాటి వ్యాపారాలు నిర్వహిస్తూ లాభాలు గడించాలని మహిళలను కోరారు. చేయూత లబ్ధి అందని వారు గ్రామ, వార్డు సచివాలయాలు లేదా మండల అధికారులను సంప్రదిస్తే వెంటనే ఖాతాల్లో నగదు జమయ్యేలా చూస్తారన్నారు. అనంతరం జిల్లాలో 85,105 మంది మహిళలకు సంబంధించి రూ.159.57 కోట్ల చెక్కును అందజేశారు.



భీమవరం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నియోజకవర్గాల వారీగా..

ఆచంటలో 9,932 మందికి రూ.18.62 కోట్లు, భీమవరంలో 12,155 మందికి రూ.22.79 కోట్లు, నరసాపురంలో 9,729 మందికి రూ.18.24 కోట్లు, పాలకొల్లులో 13,722 మందికి రూ.25.73 కోట్లు, తాడేపల్లిగూడెంలో 10,696 మందికి రూ.20.06 కోట్లు, తణుకులో 12,176 మందికి రూ.22.83 కోట్లు, ఉండిలో 13,858 మందికి రూ.25.98 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం మండలంలో 2,837 మందికి రూ.5.32 కోట్ల లబ్ధి చేకూర్చారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మెప్మా ఐబీ గ్రంధి పార్వతి, డీపీఎం ఎం.శ్రీనివాస ప్రసాదు, జిల్లా సమైక్య అధ్యక్షురాలు పి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలోకి చేరికలు



పార్టీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం : గ్రామాల్లోని ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే చూస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం బొబ్బనపల్లి గ్రామానికి చెందిన సుమారు 40 మంది జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్క ఇంటిలోనూ ప్రభుత్వ అందజేసిన సంక్షేమ పథకాలు లబ్ధి చేకూర్చడంతో ఆ కుటుంబాలన్నీ ఆనందంతో కళకళలాడుతున్నాయని ఆయన చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న పురోభివృద్ధిని చూసి పెద్ద ఎత్తున ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడూరి ఓంకారం, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతలపూడి: తిమ్మిరెడ్డిపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్, విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కొప్పాల రాజు ఇంట్లో నిల్వ ఉంచిన 2,500 కేజీల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శంఖుచక్రపురానికి చెందిన కఠారి చిన్నారావుతో కలిసి కాకినాడకు చెందిన చోడిశెట్టి మహేష్‌కు విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామ స్వరాజ్యాన్ని జగన్ సాధించారు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- దువ్వలో ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి పనుల ప్రారంభం



దువ్వలో సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: గ్రామాల్లో సచివాలయాల ఏర్పాటు ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాధించారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం తణుకు మండలం దువ్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ 3వ సచివాలయం భవనం, రైతు భరోసా కేంద్రంతో పాటు గ్రామంలోని వివిధ అంతర్గత సీసీరోడ్లు, డ్రెయిన్లను మంత్రి ప్రారంభించడంతో పాటు పలు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ప్రజాదీవెన పాదయాత్ర, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన దువ్వ గ్రామంలో గడపగడపకు తిరిగి ప్రభుత్వ పథకాల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమాన్ని కోరుతూ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హులందరికీ గడప వద్దకే వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలన్నీ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చిన మహానీయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ప్రజలకు ఏం చేశారో ప్రజలే నిలదీయాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా కేవలం టీడీపీ నాయకులే దోచుకుని పంచుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరికీ అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో దువ్వ గ్రామంలో కేవలం రూ.12 కోట్ల 82 లక్షల మాత్రమే అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క తేతలి గ్రామంలోనే రూ.117 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. గతంలో ప్రజలకు చెందాల్సిన అనేక సంక్షేమ పథకాల సొమ్ములు టీడీపీ నాయకులు దోచుకున్నారని చెప్పారు. గతంలో దోచుకున్నది చాలక ఇప్పుడు మళ్లీ ఓట్లు అడుగుతూ ఏ ముఖం పెట్టుకుని గ్రామాల్లో తిరుగుతున్నావని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన అభ్యర్థి రాధాకృష్ణను ప్రశ్నించారు. గతంలో టీడీపీ హయాంలో ఉన్న బడ్జెట్‌తోనే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందించారని, ఇవన్నీ అప్పుడు ఎందుకు ఇవ్వలేదో టీడీపీ నాయకులను ప్రశ్నించాలని కోరారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల సమయం రావడంతో రెండు కండువాలతో వచ్చి మళ్లీ ఓట్లేయించుకుని మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ భరణీ ప్రసాద్, అత్తిలి మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు జీకే రాజు, మండల రైతు విభాగం దండు కృష్ణంరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం అనందకుమార్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీ సురేష్, ఎంపీడీవో శ్రీలలిత, కోనాల గ్రామ సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్యతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్రాజుకు ప్రముఖుల ఘన నివాళులు



సర్రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోషేన్‌రాజు



నివాళులర్పిస్తున్న ప్రసాదరాజు, వాసుబాబు, పీవీఎల్

కాళ్ల : దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు మరువలేమని మండలి చైర్మన్ కొయ్యేమోషేన్ రాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహ రాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు నివాసం వద్ద గురువారం దివంగత నేత పాతపాటి సర్రాజు ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని స్పష్టం చేశారు. ఉండి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారని చెప్పారు. ఆయన నియోజకవర్గానికి చేసిన సేవలను ప్రజలు మరువరున్నారు. ఈ కార్యక్రమంలో సర్రాజు కుమారులు పాతపాటి శ్రీనివాసరాజు, యుగంధర్ వర్మ, గాదిరాజు సుబ్బరాజు, ప్రముఖ వైద్యులు నీలాద్రి రాజు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి



పోలవరం ఆసుపత్రిలో హర్షకుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అద్దయ్య

పోలవరం రూరల్: పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రం రేవులో గురువారం రాత్రి విద్యుత్ అలంకరణ పనులు చేస్తుండగా ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టిసం రేవులో విద్యుత్ అలంకరణ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ పనులు చేస్తున్న పట్టిసం గ్రామానికి చెందిన పెంటపాటి హర్షకుమార్ (22) విద్యుత్ వైర్లు కలుపుతుండగా, ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే స్పందించి సీపీఆర్ నిర్వహించారు. కొద్దిగా హర్షకుమార్ కోలుకోవడంతో 108కి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన 108 వాహనంలో పోలవరం వైద్యశాలకు తరలించారు. వైద్యశాలకు చేరిన వెంటనే మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో పట్టిసీమ గ్రామస్తులు, కుటుంబసభ్యులు వైద్యశాలకు చేరుకుని బోరున విలపించారు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతోనే ఈ ఘటన జరిగిందంటూ ఆరోపించారు. సంఘటన తెలిసిన వెంటనే ఆర్డీవో కె.అద్దయ్య, డీఎస్పీ ఎన్.సురేస్‌కుమార్, సీఐ జి.మధుబాబు, తహసిల్దార్ జీవీఎస్ ప్రసాద్ వైద్యశాలకు చేరుకుని హర్షకుమార్ మృతిపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే హర్షకుమార్‌ను సకాలంలో ఆసుపత్రికి తీసుకురాలేదని, దీనివల్లే అతను మృతి చెందాడంటూ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ దృష్టికి విషయం తీసుకువెళ్లి ప్రభుత్వం పరంగా న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా, మహాశివరాత్రి ఉత్సవాల ప్రారంభంలో అపశృతి చేసుకోవడం గతంలో ఎన్నడూ జరగలేదు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడి దుర్మరణం



ప్రమాదంలో తీవ్ర గాయాలతో సూరగాని బుల్లియ్య

తాడేపల్లిగూడెం రూరల్: ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడు తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నీలాద్రిపురం గ్రామానికి చెందిన సూరగాని బుల్లియ్య (17) మోటారు సైకిల్‌పై బంధువుల కుమార్తెను తాడేపల్లిగూడెంలో పరీక్షల నిమిత్తం దించి తిరిగి నీలాద్రిపురం వెళుతున్నాడు. చినతాడేపల్లి రోడ్డులోని ఫ్లైయాష్ బ్రిక్స్ ఇండస్ట్రీ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ బంపర్‌ను ఢీకొని కింద పడగా, ట్రాక్టర్ ట్రక్కు చక్రాలు బాలుని కాలిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతనిని హుటాహుటిన 108 అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం షాపులో ఉంగరాల చోరీ

జంగారెడ్డిగూడెం : జ్యువెలర్స్ షాప్‌లో ఇద్దరు మహిళలు చేతివాటం చూపించారు. బంగారం కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు నటించి షాపు యజమాని కళ్లుగప్పి రెండు బంగారు ఉంగరాలు చోరీ చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలోని ఓ బంగారం దుకాణానికి ఇద్దరు మహిళలు బంగారం కొనేందుకు వెళ్లారు. షాపులో బంగారు ఉంగరాలు చూపించమని అడిగారు. షాపు యజమాని ఉంగరాలు చూపించగా, వాటిని చూస్తున్నట్లుగా నటించి, కాసున్నర బరువు ఉన్న రెండు బంగారు ఉంగరాలు కాజేసి, వారి వద్ద ఉన్న రోల్డ్ గోల్డ్ ఉంగరాలను బంగారు ఉంగరాల స్థానంలో పెట్టారు. చివరకు బంగారం కొనుగోలు చేయకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడంతో అనుమానం వచ్చిన యజమానికి ఉంగరాలను పరిశీలించగా, అవి రోల్డ్ గోల్డ్ ఉంగారాలుగా నిర్ధారించుకున్నారు. సీసీ టీవీ పుటేజ్‌లో ఇద్దరు మహిళలను గుర్తించారు. అయితే దీనిపై పోలీసులను వివరణ కోరగా, తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమడోలు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. భీమడోలుకు చెందిన చెన్నం నాగేశ్వరరావు (49) కొంతకాలంగా వ్యాపార రీత్యా ఏలూరులోని శనివారపు పేటలో కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మనస్తాపంతో బుధవారం రాత్రి భీమడోలు శివారులోని పొలాల్లో ఓ చెట్టుకు ఉరి వేసుకుని నాగేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: పదహారేళ్ల బాలిక అదృశ్యంపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఉండి గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక బుధవారం రాత్రి 7 గంటలకు ఇంటి వద్ద నుంచి అదృశ్యమైంది. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కొబ్బరి రైతుల సంక్షేమానికి బోర్డు కృషి

తాడేపల్లిగూడెం రూరల్: కొబ్బరి రైతుల సంక్షేమానికి కొబ్బరి అభివృద్ధి బోర్డు కృషి చేస్తుందని కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కొమర్‌వేల్ అన్నారు. గురువారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో కొబ్బరి రైతుల సమావేశం కొబ్బరి రైతుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చెరుకువాడ అప్పల రామకృష్ణవర్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస సీపీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, కోకోనట్ బోర్డు టెక్నికల్ ఆఫీసర్లు కిరణ్, సురేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు పట్టణంలోను, పెంటపాడులోను గురువారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగాయి. ఆరు కళాశాలలు వాసవి, జీఎంఆర్, ఆదిత్య, ప్రగతి, గోయెంకా ఉమన్స్, పెంటపాడు జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం లెక్కలు, బొటనీ, సివిక్స్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1950మంది పరీక్షలకు హాజరుకావా ల్సిఉండగా 1902మంది పరీక్షలు రాశారు. 48 మంది హాజరుకాలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగా యని ఆయా కళాశాలల ప్రతినిధులు తెలిపారు.

అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ ఫలాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ ఫలాలు అందిస్తూ ఆదర్శంగా పరిపాలన సాగిస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా పిసినకాడలో జరిగిన వైఎస్సార్ చేయూత నాలుగో విడత సొమ్ము బటన్ నొక్కి అక్క చెల్లెమ్మల ఖాతాలో సొమ్ములు వేయడం జరిగిందన్నారు. ఒక్కొక్కరికి రూ 75 వేలు ఇవ్వడం ద్వారా ఎన్నికల హామీ అమలు చేశారని కొనియాడారు. మూడు రాజధానులకు సీఎం కట్టుబడి ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావడం, విశాఖలో ప్రమాణ స్వీకారోత్సవం ఖాయమన్నారు. పి.శ్రీనివాస్, వై.ముసలయ్య, సందీప్, రోహిత్, సునీల్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా శివ జయంతి మహోత్సవాలు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం తాడేపల్లిగూడెం నిర్వాహకురాలు బీకే రమాదేవి ఆధ్వర్యంలో శివ జయంతి మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జ్ఞాన ప్రకాశ్ భవనం వద్ద సహస్రలింగ, స్వయం ప్రకాశ దివ్య దర్శనంలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పెద్ద సంఖ్యలో హాజరైయారు.

నేడు తణుకులో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

తణుకు టౌన్: తణుకు పట్టణంలోని పాతూరు శ్రీ గణపతి గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఈనెల 9వ తేదీన రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారని విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు.

శుభంకరుడు.. శంకరుడు

- తణుకు, తాడేపల్లిగూడెం డివిజన్లలో ముస్తాబైన శైవక్షేత్రాలు
- లక్ష లింగాల మధ్య కొలువైన ఏకైక స్పటిక లింగం


వీరంపాలెంలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న బాలాత్రిపుర సుందరీ ఆధ్యాత్మిక పీఠం, స్పటిక లింగం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్/తణుకు: హరోంహర.. శుభంకర..అంటూ శైవక్షేత్రాలు మార్మోగనున్నాయి. మహా శివరాత్రి పురస్కరించుకొని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని శివాలయాలు సుందరంగా ముస్తాభయ్యాయి. వీరంపాలెంలో శ్రీబాలాత్రిపుర సుందరి ఆధ్యాత్మిక పీఠంలో ఈ నెల ఎనిమిదిన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 108 మంది దేవతామూర్తులు కొలువైన ఏకైక ఆలయంగా చెప్పుకొనే ఈ పవిత్ర పుణ్య క్షేత్రంలో ఏర్పాటు చేసిన స్పటిక లింగాన్ని దర్శించుకొనేందుకు రాష్ట్రం నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడం విశేషం.

ఘనంగా భ్రమరాంభికా సమేత మల్లిఖార్జున స్వామికి దివ్య కల్యాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహా శివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని (పెద్ద శివాలయం)లో భ్రమరాంభికా సమేత మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, వాణిదేవి దంపతులచే రాత్రి దివ్య కల్యాణం నిర్వహించారు.


శైవక్షేత్రంలో కొలువైన మహాలింగం


పట్టణంలోని పెద్ద శివాలయం

విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. భక్తులు దర్శనం నిమిత్తం భారీ పందిర్లు వేశారు.


భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి

ఆలయంలోను స్వామివారికి పుష్పాలతో విశేష అలంకరణలు చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలన్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. పెంటపాడు పెద్దశివాలయమైన పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయం, విప్పర్రు, దర్శిపర్రులోని పురాతన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాలు, బోడపాడు, రాచర్ల గ్రామాల్లోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయాలలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల వద్ద ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా మూడు రోజులపాటు ఉత్సవాలు చేసేందుకు విద్యుత్ కటౌట్‌లు, వేసి ఆలయాలను సిద్ధం చేశారు.

మంత్రి కారుమూరికి కాంట్రాక్టు అధ్యాపకుల వినతి

తణుకు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరం ఇచ్చినప్పటికీ కింది స్థాయి అధికారుల నిర్వాకం కారణంగా కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ అంశం నిలిచిపోయిందని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బీజే గాంధీ, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబులు పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావును తణుకులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు గతేడాది జూన్ 7న కేబినెట్ నిర్ణయం తీసుకుని జీవో 114 ద్వారా అభ్యర్థుల వివరాలను సేకరించారని చెప్పారు. మంత్రి కారుమూరిని కలిసిన వారిలో తణుకు, అత్తిలి, ఆచంట మండలాల పరిధిలోని జూనియర్ కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారు.

మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

తణుకు టౌన్: మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం సాయంత్రం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామ సచివాలయంలో వెలుగు, మహిళా అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవేనని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో నిర్వహించిన ప్రజా దీవెన పాదయాత్ర రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలో పాదయాత్ర చేసిన మంత్రి కారుమూరికి మహిళలు మంగళ హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, రాజకీయ పదవుల్లో బీసీలకు పెద్ద పీట వేశారని చెప్పారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ నేరు బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రతి కుటుంబంలో తమ కుటుంబ సభ్యునిగా మారిపోయారని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతి కుటుంబం ఆనందంతో ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ రెండు మూడు కండువాలతో వచ్చి గ్రామాల్లో తిరుగుతూ కల్లబొల్లి మాటలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని, అటువంటి నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ప్రజల సొమ్మును దోచుకో, పంచుకో, దాచుకో విధంగా జరిగిందని, నేడు కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైనవారందరికీ గడప వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌లు నత్తా కృష్ణవేణి, భరణి ప్రసాద్, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్ గోపాల కృష్ణ, ఎంపీటీసీలు శ్రీనివాసు, అశోక్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు కృష్ణంరాజు, జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ, నాయకులు కుడిపూడి చంద్రరావు, కోట నాగేశ్వరరావు, ఫణీంద్ర, ఎంపీడీవో శ్రీలలిత, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.


దువ్వలో ప్రజా దీవెన పాదయాత్ర చేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

మగవారికి దీటుగా రాణిస్తున్న మహిళలు


అత్తిలి మండలం వరిఘేడు అంగన్‌వాడీ కేంద్రం వద్ద వివిధ వేషధారణలో చిన్నారులు


విప్పర్రు ప్రాథమిక పాఠశాల వద్ద మానవహారం చేస్తున్న మహిళలు

అత్తిలి: మహిళలు మగవారికి ధీటుగా అన్ని రంగాల్లో ముందంజలో కొనసాగుతున్నారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో మహిళలు, పురుషులతో సమానంతో అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. మహిళా సంరక్షణ అధికారిణి సత్య శ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు కె మీనాకుమారి, సిహెచ్ బేబి, వై శ్రీదేవి, కుమారి, సావిత్రి, సహాయకులు సునీతా, ఇందిరా, సుహాసిని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం అత్తిలి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జానకి, మౌనిక, తల్లులు పాల్గొన్నారు. బల్లిపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని అవగాహన ర్యాలీ జరిపారు. బేటీ బచావో-బేటీపడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లను చదివిద్దాం- ఆడపిల్లను బ్రతికిద్దాం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి నర్సవేణి, ఎం శివసత్యవతి, బి నిర్మలకుమారి, సిహెచ్‌వీ రామలలిత తదితరులు పాల్గొన్నారు. సీతానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ కె కుమారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జె మౌనిక, యు జానకి, వలంటీర్లు పి బింధు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాటం

తాడేపల్లిగూడెం అర్బన్: మహిళలు సమానత్వం కోసం పోరాడాలని, ఎటువంటి సమస్యనైనా మనోధైర్యంతో ఎదుర్కొవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని సరస్వతి తెలిపారు. స్థానిక 24 వార్డులోని బిసి హాస్టల్ వద్ద గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ విశాలాక్షి, కార్యకర్తలు టి సుజాత, కె ప్రసన్న, పి శావత్రి, ఏఎన్ఎం జయభారతి, ఎంఎస్‌కే, ఎండీ నజరిన్, ఆశావర్కర్లు, ఎస్ విజయలక్ష్మి, బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

పెంటపాడు: అంతర్జాతీయ మహిళాదినోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా విప్పర్రు సుఖాలదిబ్బ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు, తల్లులు, కిశోర్ బాలికలతో సమావేశాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెంటు జయలక్ష్మి, పెంటపాడు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మౌనిక, ఎంపీటీసీ సభ్యురాలు యండ సరస్వతి తదితరులను ఘనంగా సన్మానించారు.

శ్రీవాసవిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.లీలాకుమారి పాల్గొన్నారు. ఎంతఊట జ్యోతి, పాలక వర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరక్టర్ చెక్కా అప్పారావు, రత్నావతి, జ్యోత్స్నలు తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ ఇంధన పరిశ్రమలో హై అలర్ట్

- ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ శాఖల అధికారుల అప్రమత్తం
- మాక్‌డ్రిల్ కావడంతో ఊపిరి పీల్చుకున్న జనం

తణుకు: ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఆంధ్రాసుగర్స్ అనుబంధ రాకెట్ ఇంధనం తయారీ ప్లాంటు గురువారం ఉదయం ఒక్కసారిగా నిరంతరాయంగా మోగిన సైరన్‌తో అధికారులు అప్రమత్తమయ్యారు. తణుకు-వేల్పూరు రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. ప్లాంటులో సుమారు 25మంది స్పృహకోల్పోయారు. ఫైరింజన్లు, అంబులెన్సులు రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది... ఏం జరిగిందో తెలియని అలజడి రేగడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందారు. చివరికి మాక్ డ్రిల్ అని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆంధ్రాసుగర్స్‌కు అనుబంధంగా ఉన్న రాకెట్ ఇంధన పరిశ్రమలో ఉపయోగించే బుటాడైన్ అనే ముడిపదార్థం అనుకోని పరిస్థితుల్లో ట్యాంకు నుంచి లీకై ప్రమాదం సంభవించినప్పుడు తీసుకువాల్సిన చర్యలను మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. ఆర్‌డీవో చెన్నయ్య ఆధ్వర్యంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్, ఆంధ్రాసుగర్స్ మేనేజర్ పాతూరి విశ్వనాధకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సహాయక చర్యలు చేపట్టిన ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది